బోనాల నిధుల కోసం దరఖాస్తు చేసుకోండి

ఉప్పల్, జూన్ 25: ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఆలయ కమిటీలు బోనాల నిధుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. హబ్సిగూడలోని ఆంజనేయస్వామి ఆలయంలో దరఖాస్తు పత్రాలను ఈఓకు అందజేయాలన్నారు. గత ఏడాది దరఖాస్తులు చేసిన వారు మళ్లీ చేసుకోవాలని పేర్కొన్నారు. ఆషాడబోనాల ఉత్సవాలకు సౌకర్యాల కల్పనకు కృషిచేస్తున్నామని చెప్పారు. త్వరలోనే సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు.

ఓఆర్ఆర్‌పై డీసీఎం బోల్తా

కీసర, జూన్ 25: కీసర పోలీసుస్టేషన్ పరిధిలోని ఔటర్‌రింగ్ రోడ్డుపై గ్యాస్ సిలిండర్ లోడ్‌తో వెళ్తున్న డీసీఎం బోల్తా పడ్డ పడింది. మంగళవారం ఉదయం ఘట్‌కేసర్ నుంచి బోల్లారం వైపు కీసర మీదుగా వస్తున్న గ్యాస్ సిలిండర్ డీసీఎం కీసర ఔటర్‌రింగ్‌రోడ్డులో బోల్తా పడింది. ఈ ఘటనలో డీసీఎం డ్రైవర్ శ్రీనివాస్‌గౌడ్, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి పరిశీలించారు.

డీజిల్ ట్యాంకర్ బోల్తా.. ఇద్దరికి గాయాలు

కీసర, జూన్ 25: డీజిల్ ట్యాంకర్ బోల్తా పడ్డ ఘటన కీసర పోలీసుస్టేషన్ పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాయిపల్లిలో మంగళవారం డ్రైవర్ నిర్లక్ష్యంతో డీజిల్ ట్యాంకర్ బోల్తా కొట్టింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాలను మళ్లించారు. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ నర్సింహకు తీవ్ర గాయాలయ్యాయి. అతని వెంటనే చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఐమాస్ట్ లైట్లకు మరమ్మతు

కీసర, జూన్ 25: కీసర దాయరలో తన సొంత డబ్బులతో ఐమాస్ట్ లైట్స్‌ను మాజీ ఎంపీటీసీ బెలిదే రమేశ్‌గుప్త మంగళవారం మరమ్మతులు చేయించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 25: నాసిరకం ఆహారంతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న గిరిజన వసతి గృహ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శివనాంద్ డిమాండ్ చేశారు.నాగారంలో ప్రభుత్వ గిరిజన వసతిగృహాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. వసతి గృహంలో ఆహారం సరిగా ఉండడం లేదని విద్యార్థులు శివానంద్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం కాకుండా నాసిరకమైన ఆహారం అందించడంతో విద్యార్థులు అర్ధఆకలితో కళాశాలలకు వెళుతున్నారని, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉద్యోగులుఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్న ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

27న నూతన బస్సు సర్వీసులు ప్రారంభం

చర్లపల్లి,జూన్25: ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా కుషాయిగూడ బస్ డిపో పరిధిలో నూతన బస్ సర్వీసులను ఏర్పాటు చేస్తున్నామని కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్ పేర్కొన్నారు. కుషాయిగూడ డిపో కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కుషాయిగూడ డిపో పరిధిలోని ఈసీఐఎల్ బస్ టెర్మినల్ నుంచి ఈ నెల27న 38టీ/16సీఆర్ నూతన బస్ సర్వీసును ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు. నూతన బస్ ఈసీఐఎల్ బస్ టెర్మినల్ నుంచి ఏఎస్‌రావునగర్, సాయినాథపురం, భరత్‌నగర్, ఆర్టీసీ కాలనీ, ఈస్ట్ ఆనంద్‌బాగ్, ఉత్తమ్‌నగర్, జ్యోతినగర్, తుకారం గేట్, శిన్యాయి నర్సింగ్ హోమ్ నుంచి సికింద్రాబాద్ వరకు నడిపిస్తున్నామని ఆయన తెలిపారు. ఉదయం ఉదయం 7.30నిల నుంచి ప్రతి 30నిమిషాలకు బస్ సర్వీసు నడుస్తుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వినికిడి పరీక్షలు

నేరేడ్‌మెట్, జూన్ 25: ఉచిత వినికిడి పరీక్షలు నేడు జరగనున్నట్లు హెలెన్ కెల్లర్ ఫౌండర్ చైర్మన్ పఠాన్ ఉమ్మర్‌ఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం పఠాన్ ఉమ్మర్ ఖాన్ మాట్లాడుతూ నేటినుంచి ఈనెల 29వరకు శ్రీకాలనీలోని హెలెన్ కెల్లర్ స్పీచ్ హియరింగ్ క్లీనిక్‌లో జరగనున్నట్లు చెప్పారు. ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటలవరకు జరగనున్నట్లు, పేద బదిర పిల్లలకు 1వ తరగతినుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్యాహాస్టల్ కల్పించేందుకు ఈనెల 29న వరకు బధిర పిల్లలను చేర్పించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని బదిర విద్యార్థులందరూ సద్వినియోగపరచుకోవాలని కోరారు.

వృద్ధుడు అదృశ్యం

మల్లయ్య (ఫైల్)

నేరేడ్‌మెట్, జూన్ 25: ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. రేణుకానగర్‌లో నివాసం ఉంటున్న కొమ్మరాజుల మల్లయ్య (75) ఈనెల 24న ఉదయం 11గంటల ప్రాంతంలో ఇంటినుంచి మధురానగర్‌లోని దవాఖానకు వెళ్లి ఈరోజు వరకు తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు మంగళవారం నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తామని చెప్పారు.

డబుల్ ఇండ్లలో సౌకర్యాలు కల్పించాలి: ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కోరుతున్న లబ్ధిదారులు

మల్కాజిగిరి, జూన్ 25: డబుల్ బెడ్ రూం ఇండ్లలో ప్రభుత్వం మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం జరుగుతున్న డ్రైనేజీ, తాగునీరు, ఎల్లక్ట్రికల్ పనులను మధ్యలో ఆపివేశారని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పేదల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూంలు కట్టి లబ్ధిదారులకు కేటాయించిందని అన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం పనులను ఆపివేయడం కక్షసాధింపు చర్యగా భావించాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం వెంటనే స్పందించి ఇండ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం..

పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందజేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ బీజేఆర్ నగర్ బస్తీకి చెందిన పద్మావతి చికిత్స కోసం రూ.1?50లక్షల సీఎంఆర్ పత్రాలను ఎమ్మెల్యే వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు ఇంటి వద్ద ఆరోగ్య సేవలు అందించడానికి బస్తీ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మల్కాజిగిరిలో ఏరియా దవాఖానలు సేవలందిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో శ్రీధర్, సుకేశ్, సతీష్, టీంకు, హ్యారీ, మహేష్, రవి, విజయ్, చందు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 25: మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికంగా ఎదగాలని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ ఎస్సీ కార్పొరేషన్, ప్రొఫ్యాషన్ ఆధ్వర్యంలో 3 నెలల పాటు కుట్టు శిక్షణ పొందిన 70 మంది మహిళలకు మంగళవారం ఉచితంగా కుట్టుమిషన్లను మల్లారెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగల్లో ముందుఉంటున్నారని అన్నారు. కుట్టు శిక్షణ తీసుకున్న మహిళలు 10 మందికి శిక్షణ ఇవ్వడంతో పాటు వ్యాపార రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్,కమిషనర్ రాజేందర్ కుమార్, కౌన్సిలర్లు, కో-అప్షన్ సభ్యులు, అధికారులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం..

మల్కాజిగిరి డివిజన్ కృపాకాంప్లెక్స్ వద్ద నాలాలోని పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి, జూన్ 25: ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. మంగళవారం బలరాంనగర్‌లో రూ.15లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణపనులకు శంకుస్థాపన, కృపాకాంప్లెక్స్ వద్ద నాలాలోని పూడికతీత పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణపనుల్లో నాణ్యతను పాటించాలన్నారు. వరదముంపు రాకుండా నాలాలలోని పూడికను తీయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ దీపక్, ఎంటమాలజీ ఆఫీసర్ దుర్గప్రసాద్, విజయ్‌కుమార్, సూరజ్, నాగరాజు, పాల్గొన్నారు.

'సర్కారు విద్యార్థులకు' చేయూతనందిస్తా..

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ట్రస్టు నిర్వాహకులు కాలేరు జైనవీన్

ఉప్పల్, జూన్ 25: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా ఉంటూ వారికి చేయూతనందిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని హబ్సిగూడ ప్రభుత్వ పాఠశాలలో కాలేరు యమునాబాయి ట్రస్టు ఆధ్వర్యంలో కాలేరు జైనవీన్ సహకారంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరైనారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు ద్వారా సేవలు అందించడం అభినందనీయమన్నారు. పాఠశాలకు సంబంధించిన సమస్యలను ప్రధానోపాధ్యాయురాలు పుష్ప తెలియజేశారు. ఈ మేరకుక స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. మరోసారి పాఠశాలను సందర్శిస్తామని, సమస్యల సాధనకు తగిన పరిష్కార చర్యలు చేపడతామన్నారు. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, మహేష్‌గౌడ్, సుధాకర్, అజిత్ రెడ్డి, శంకర్, చాంద్‌పాషా, బోసాని పవన్, అద్విత్, శ్యామ్, నాని, చందు, లక్ష్మణ్‌రావు, లక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నాచారం ఎర్రకుంటకు చెందిన గద్ద నర్సింగ్‌రావు మృతి సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంతాపం తెలిపారు. ఈమేరకు మంగళవారం నాచారంలో వారి నివాసానికి వెళ్లి నర్సింగ్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్,కాలనీవాసులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్‌దరఖాస్తులను క్లియర్ చేయాలి

కీసర ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్, జూన్25(నమస్తే తెలంగాణ): ధరణి పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా ధరణికి సంబంధించిన అన్ని దరఖాస్తులను క్లియర్ చేయాలని సూచించారు. అన్ని మాడ్యూల్స్ దరఖాస్తుల పరిశీలన పక్రియను వేగవంతం చేయాలన్నారు. మంగళవారం కీసర ఆర్డీవో కార్యాలయంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులను పరిశీలించారు. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయన్నా దానిపై ఆరా తీశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులను నమోదు చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి కబ్జాకు గురైన భూములను గుర్తించి పరిరక్షించాలని సూచించారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి

మేడ్చల్, జూన్ 25: వ్యవసాయ ఆధారిత గ్రామీణ ప్రాంతాల్లో మూగ జీవాలు, పశు సంచార వైద్య అంబులెన్స్ ద్వారా వైద్య సేవలను అందించే తమకు సకాలంలో వేతనాలు చెల్లించాలని పశు వైద్య అంబులెన్స్ 1962 సిబ్బంది డిమాండ్ చేశారు. మంగళవారం మేడ్చల్‌లో వెటర్నరీ డాక్టర్ దివ్యశ్రీ, వెటర్నరీ అసిస్టెంట్ అనిల్ కుమార్, అటెండర్ రోహిత్ మాట్లాడు తూ నియోజకవర్గానికి ఒక అంబులెన్స్ చొప్పున మూగజీవాలకు వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు వైద్య సేవలందిస్తూ నిత్యం రైతులకు అందుబాటులో ఉంటున్నామన్నారు.కొన్ని నెలలుగా తమకు వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తాము ఇంత కష్టపడుతున్నా సకాలంలో వేతనాలు చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించారు. తమకు సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు.

నకిలీ ఫుడ్‌ప్యాకింగ్ యూనిట్లపై ఎస్ఓటీ దాడి

తనిఖీలు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్

మల్కాజిగిరి, జూన్ 25: నకిలీ ఫుడ్(సరకులు) ప్యాకింగ్ యూనిట్లపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం అల్వాల్, దమ్మాయిగూడలలో నకిలీ ఫుడ్(సరకులు) ప్యాకింగ్ యూనిట్లలో రీప్యాకింగ్ జరుగుతున్నట్లు అధికారులకు సమాచారం తెలిసింది. ఈ సందర్భంగా గ్రేటర్ మున్సిపల్ ఫూడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌తో పాటు మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు అల్వాల్, దమ్మాయిగూడ లోనియూనిట్లలో తనఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా యూనిట్లను సరియైన అనుమతులు లేవని గుర్తించారు. ప్యాకింగ్ చేస్తున్న ఫూడ్ వస్తువులు నాణ్యతలేనట్లు గుర్తించారు.పరిసరాల్లో పారిశుధ్య లోపం ఉన్నట్లు గుర్తించారు. దాదాపు లక్ష రూపాయల విలువగల సరకులను స్వాధీనం చేసుకున్నారు. నాణ్యతలేని సరకులను పరీక్షల కోసం నాచారంలోని ఫుడ్ సేఫ్టీ కేంద్రానికి పంపిచారు. ఫుడ్ ప్యాకింగ్ యూనిట్ల యజమానులకు నోటీసు జారీ చేశారు.

రైతు భరోసాకు ఆంక్షలు పెట్టొద్దు

రైతు నేస్తంలో కార్యక్రమానికి హాజరైన రైతులు

శామీర్‌పేట, జూన్ 25: రైతులకు ఆంక్షలెందుకని రైతులు రైతు భరోసా సబ్ కమిటీతో రైతులు మొరపెట్టుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవరం మూడుచింతపల్లి రైతు వేదికలో మేడ్చల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో రైతు భరోసా సబ్ కమిటీ సభ్యులు తుమ్మల నాగేశ్వర్‌రావు, చిన్నారెడ్డి, కోదండరెడ్డి, రాష్ట్ర స్థాయి అధికారులు రైతులతో రైతు భరోసాపై అభిప్రాయాలు సేకరించారు. ఆంక్షలు పెట్టి రైతు భరోసా కాకుండా రైతుకు వెన్నుదన్నుగా నిలిచే రైతుభరోసా ఇవ్వాలని రైతులుకోరారు. వ్యవసాయదారులకు కనీసం 10ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని మరికొందరు సూచించారు. మూడుచింతలపల్లి రైతు వేదికలో దాదాపు 80 మంది రైతులు పాల్గొనగా కేవలం ఒక్క రైతు అభిప్రాయ సేకరణతోనే సబ్ కమిటీ సరిపెట్టడం గమనార్హం. కార్యక్రమంలో డీఏవో మేరిరేఖ, ఏడీఏ వెంకట్‌రాం రెడ్డి,అధికారులు కృష్ణవేణి, రమేశ్, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలి

శామీర్‌పేట, జూన్ 25: స్వయం ఉపాధి దిశగా మహిళలు ముందుకు సాగాలని ఎంపీపీ ఎల్లూభాయిబాబు అన్నారు. డీఆర్‌డీవో ఆదేశాల మేరకు ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని గ్రామగ్రామాన మహిళా శక్తి సభల నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మహిళా శక్తికి పెద్దపీట వేస్తు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, జీపీ కార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళా శక్తిపై గ్రామ సభలు

మేడ్చల్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మహిళా శక్తి కార్యక్రమంపై మహిళలతో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. రాజబొల్లారం పంచాయతీ కార్యాలయంలో మంగళవరం ఏర్పాటు చేసిన గ్రామసభలో మహిళలకు ఈ కార్యక్రమంపై అధికారులు అవగాహన కల్పించారు. మహిళలు మహిళా శక్తి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు వెంకటేష్, మహిళా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

ఆద్రాస్‌పల్లి గ్రామంలో మహిళా శక్తి సభకు హాజరైన మహిళలు.

సుందరమైన నగరంలా తీర్చిదిద్దుతాం..

జవహర్‌నగర్, జూన్ 25: జవహర్‌నగర్‌ను సుందరమైన నగరంలా తీర్చిదిద్దుతామని మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ చెన్నాపురంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్కును మంగళవారం మేయర్, డిప్యూటీ మేయర్ సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ శాంతి మాట్లాడుతూ పార్కు నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, మొక్కలు ఎండిపోకుండా చూడాలని అధికారులను ఆదేశించింది. పార్కులో జవహర్‌నగర్ ప్రజలు సేదాతీరేందుకు పచ్చటి ఆహ్లాదాన్ని కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రంలో కార్పొరేటర్లు గొడుగు వేణు, నవీన్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు పాసుల జారీకి 43 కేంద్రాలు

సిటీబ్యూరో, జూన్25(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో 43 బస్సు పాస్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఈడీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీ ఉద్యోగులు, జేఎన్‌టీయూ విద్యార్థుల కోసం కొత్తగా జేఎన్‌టీయూ బస్టాపులో బస్సు పాస్ కౌంటర్ తెరిచామని చెప్పారు. ఈ కేంద్రాలు ఉదయం 6:30నుంచి రాత్రి 8:15 గంటల వరకు సేవలందిస్తాయన్నారు. గ్రీన్ మంత్లీ ఏసీ బస్సు పాస్‌లు కూడా జారీ చేస్తున్నట్టు వివరించారు. కాగా డిమాండ్ దృష్ట్యా మొబైల్ వెహికిల్ బస్సు పాస్ సేవలను కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ అధినేతను కలిసిన బోడుప్పల్ నేతలు

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని తన నివాసంలో మంగళవారం బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ రెడ్డి, నాయకులు రవిగౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక అంశాలను వివరించారు. -బోడుప్పల్

ఎమ్మెల్యే సత్యంకు ప్రొఫెసర్ కోదండరాం పరామర్శ

మల్కాజిగిరి, జూన్ 25: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మంగళవారం అల్వాల్‌లోని పంచశీల కాలనీలో నివసిస్తున్న ఎమ్మెల్యే సత్యం ఇంటికి ప్రొఫెసర్ కోదండరాం వచ్చి పరామర్శించారు. అనంతరం భార్య రూపాదేవి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.

పర్యావరణాన్ని కాపాడాలి

నేరేడ్‌మెట్,జూన్25: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మల్కాజిగిరి ట్రాఫిక్ సీఐ శివశంకర్ అన్నారు. మంగళవారం సఫిల్‌గూడ కృష్ణమేణి టాలెంట్ స్కూల్‌లో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా లక్ష మొక్కలు నాటే ఐ సేవ్ మై ఎర్త్ కాంపెయిన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్,పర్యావరణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, పాఠశాల విద్యార్థులు ఉన్నారు.

అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ శివశంకర్

అణిచివేతను ఎదిరిస్తేనే...ప్రజా సమస్యలకు మోక్షం

జవహర్‌నగర్ జూన్ 25: అణిచివేతను ఎదిరిస్తేనే ప్రజా సమస్యలకు మోక్షం లభిస్తుందని, భూమి, భూక్తి, విముక్తి కోసం పోరాడిన గోదావరిలోయ విప్లవ ప్రతిఘటనోద్యమ నాయకులు కామ్రేడ్ ప్రసాద్, వసంతక్కల పోరాటం ఆదర్శణీయమని సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రభాకర్ అన్నారు. మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని మా గృహలక్ష్మి సంఘం ఆవరణలో ఐపీవోడబ్ల్యూ మెరుగు పుణ్యవతి ఆధ్వర్యంలో కామ్రేడ్ ప్రసాద్, వసంతక్కల వర్ధంతి కార్యక్రమాని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లెపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌ఘడ్‌లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆదివాసి గిరిజన ప్రజలపై అంతిమ యుద్ధాన్ని ఆపాలని అన్నారు. అంతకుముదు ప్రసాద్, వసంతక్కల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి, మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో షేక్‌షావలి, సంపంగి పద్మ, చిట్టిబాబు, సునిత, నర్సన్న, రషీద్, ద్రావిడ, వెంకటేశ్వర్లు, సిద్ధిరాజు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

శామీర్‌పేట, జూన్ 25: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ అనిత కథనం ప్రకారం..పోతాయిపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న శంకర్‌గౌడ్(33) డ్రైవర్‌గా పని చేస్తున్నారు. మద్యానికి బానిసై ఇంట్లో భార్య పిల్లలతో తరచూ గొడవ పడుతుండే వాడు. రెండు రోజులుగా టీవీ విషయంలో గొడవ కావడంతో భార్యను, పిల్లలను కొట్టి ఇంట్లో నుంచి వెళ్లిన తను మద్యం మత్తులో ఇంటికి వచ్చాడు. మళ్లీ భార్యతో గొడవ పడుతూనే తన గదిలోకి వెళ్లి అతను తలుపు గడియ పెట్టుకున్నాడు. తలుపు తెరిచి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తుల అరెస్టు

మల్కాజిగిరి, జూన్ 25: భద్రాచలం నుంచి మల్కాజిగిరి గంజాయిని రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసిన సంఘటన మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మల్కాజిగిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, సీఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. ఒడిస్సాకు చెందిన బిజాయ్, రహీం స్నేహితులు. భద్రాచలం నుంచి మల్కాజిగిరికి 12.33కిలోల గంజాయిని ఇద్దరు తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ